
సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 19 । ఫిబ్రవరి । 2024



అటకెక్కిన 'చెత్త'శుద్ధి 8లో▸

ఉమ్మడి జిల్లాలో కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా మారుతున్నాయి. గ్రామాలకు దూరంగా నిర్మించడంతో వినియోగించడం లేదు.



ఆయకట్టుకు అందని నీరు 9లో▸

బేల మండలంలోని సోన్‌కాస్ శివారులో రూ.10 కోట్ల నిధులతో నిర్మించిన చెరువు సాగునీరు అందించలేని దుస్థితిలో ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గరిష్టం/కనిష్టం
35.0/21.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చాలా వరకు ఎండగా ఉంటుంది. ఉదయం పూట చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపడుతున్న జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ నూతన డీఎస్పీగా ఎల్.జీవన్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా కరీంనగర్ జిల్లా హుజురాబాద్ ఏసీపీగా ఉన్న ఆయన ఆదిలాబాద్ డీఎస్పీగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

నేడు శోభాయాత్ర

ఎదులాపురం: శివాజీ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని ఆదిలాబాద్ పట్టణంలో హిందువాహిని ఆధ్వర్యంలో సోమవారం భారీ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు హిందువాహిని జిల్లా సంయోజక్ ఏన్రాల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక గోపాలకృష్ణ మఠం నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందని, పార్టీలకు అతీతంగా ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సుధీర్, చాణక్య, సాయికిరణ్, నవనీత్, శ్యామ్, అక్షయ్, తదితరులు పాల్గొన్నారు.


అస్సాం గిరిజనుల సమస్యలు పరిష్కరిస్తాం



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

ఆదిలాబాద్: అస్సాంలోని గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. ఢిల్లీలో ఆయనను అస్సాం రాష్ట్రానికి చెందిన పలువురు గిరిజన నేతలు ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ అస్సాం రాష్ట్రంలో రిజర్వేషన్ పాలసీలకు సంబంధించిన సమస్యలను ఎదుర్కొంటున్నామన్నారు. ఎంపీ మాట్లాడుతూ సమస్యలన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అస్సాం గిరిజనులు కాశీరాం, గంగారాం, దీరు, ఖానాపూర్ బీజేపీ నాయకులు, ఆదిలాబాద్ జిల్లా దిశ కమిటీ సభ్యుడు నందిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో సత్తా



పసిడి పతకంతో యర్మ లింగు

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన క్రీడాకారుడు యర్మ లింగు జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటాడు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ నెల 14 నుంచి 18 వరకు 19వ జాతీయ ఇంట్రెస్ట్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. అండర్–14 విభాగంలో యర్మ లింగు 57.27 మీటర్ల దూరం జావెలిన్ విసిరి గోల్డ్ మెడల్ సాధించినట్లు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ రాజేశ్, కోచ్, మేనేజర్ లక్ష్మీరాం, విజిఎస్ రాకేష్ తెలిపారు. జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు, ఐటీడీఏ స్పోర్ట్స్ ఆఫీసర్ పార్థసారథి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ కాంతారావు, పెటా జనరల్ సెక్రెటరీ స్వామి, తదితరులు అభినందనలు తెలిపారు.

తైక్వాండో రాష్ట్ర కార్యవర్గంలో ముగ్గురికి చోటు



నియామకపత్రాలతో ఉమ్మడి జిల్లా మాస్టర్లు

ఆదిలాబాద్: తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గంలో ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురికి చోటు దక్కింది. గద్వాల్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన అసోసియేషన్ ఎన్నికల్లో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఏ.వీరేష్ రాష్ట్ర అసోసియేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా, మంచిర్యాల జిల్లాకు చెందిన కన్నాల వెంకటస్వామి టెక్నికల్ చైర్మన్‌గా, అజయ్ టెక్నికల్ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అసోసియేషన్ బాధ్యులు నియామక పత్రాలు అందజేశారు.

'పది'లో అగ్రస్థానమే లక్ష్యం

- మార్చి 18 నుంచి పదోతరగతి పరీక్షలు
- గతం కంటే మెరుగైన ఫలితాల సాధన దిశగా
- చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- ప్రత్యేక తరగతులతో సన్నద్ధం
- మార్చి 1 నుంచి ప్రీ ఫైనల్
- 'సాక్షి' ఇంటర్వ్యూలో డీఈవో ప్రణీత



ప్రణీత, డీఈవో, ఆదిలాబాద్

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతిలో అగ్రస్థానమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.. ఆ దిశగా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశాం. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి పరీక్షల్లో విజయం సాధించేలా సన్నద్ధం చేస్తున్నాం. ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులు బోధిస్తున్నాం. నిపుణులైన ఉపాధ్యాయులతో విద్యార్థుల సందేహాలు నివృత్తి చేయిస్తున్నాం.. పబ్లిక్ పరీక్షల్లో గతేడాది కంటే ఈసారి మెరుగైన ఫలితాలతో టాప్ 'టెన్'లో నిలిచేలా చూస్తున్నాం.. రివిజన్ తరగతులు నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి టి.ప్రణీత అన్నారు. ఆదివారం 'సాక్షి' నిర్వహించిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

సాక్షి: 'పది'లో మంచి ఫలితాల సాధన కోసం ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

డీఈవో: పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు చేపడుతున్నాం. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు బోధిస్తున్నాం. గ్రూపులుగా విభజించి చదువులు కొనసాగిస్తున్నాం. అభ్యాస దీపికలు అందజేశాం. ప్రతీరోజు స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నాం. ఉపాధ్యాయులు రాత్రి వేళల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి చదివించాలని సూచిస్తున్నారు. పరీక్షలు అయ్యేంత వరకు టీవీ, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలని పేర్కొంటున్నారు. అలాగే శుభకార్యాలు, విందులు, వినోదాలకు దూరంగా ఉంచాలని చెబుతున్నారు.

సాక్షి: జిల్లాలో గతేడాది ఫలితాలు ఎలా ఉన్నాయి.. ఈసారి ఎన్నోస్థానంలో ఉండవచ్చు?

డీఈవో: జిల్లాలో గతేడాది పదో తరగతి ఫలితాల పరంగా 88.68 శాతం ఉత్తీర్ణత సాధించి 19వ స్థానంలో నిలిచాం. రాష్ట్రస్థాయిలో జిల్లాకు 19వ స్థానం దక్కింది. ప్రస్తుతం మంచి ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన చేపట్టాం. ఈసారి మరింత మెరుగైన ఫలితాల కోసం కృషి చేస్తాం. వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు వందరోజుల ప్రణాళికను తయారుచేశాం.

సాక్షి: ఎస్సెస్సీ పబ్లిక్ పరీక్షలు ఎంతమంది రాయనున్నారు?

డీఈవో: మార్చి 18 నుంచి 30వ తేది వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరగనుంది. ఏప్రిల్ 1న ఒకేషనల్ పరీక్ష నిర్వహించబడుతుంది. రెగ్యులర్ విద్యార్థులు 10,401 మంది, ప్రైవేట్ విద్యార్థులు 53 మంది, మొత్తం 10,454 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

సాక్షి: పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

డీఈవో: వివిధ శాఖల అధికారుల సమన్వయంతో పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తాం. దీనికి సంబంధించి కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరగనుంది. పరీక్ష కేంద్రంలో తాగునీరు, విద్యుత్, వైద్యసేవలు, బెంచీలు ఏర్పాటు చేస్తాం. ఏ ఒక్క విద్యార్థికి సమస్య ఎదురుకాకుండా చర్యలు చేపడతాం.

సాక్షి: పరీక్ష నిర్వహణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

డీఈవో: జిల్లా వ్యాప్తంగా 53 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. పరీక్ష నిర్వహణ కోసం 53 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 54 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 13 సీ–కేటగిరీ కేంద్రాలకు 13 మంది కస్టోడియన్‌లను నియమించాం. మూడు స్క్వాడ్ బృందాలను నియమిస్తాం. పరీక్ష పేపర్ తెరిచే గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం.

సాక్షి: విద్యార్థులకు మీరిచ్చే సలహా ఏమిటి?

డీఈవో: పదోతరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులు ఇప్పటినుంచే సాధన చేయాలి. పరీక్షలకు మరో నెల రోజుల సమయం మాత్రమే ఉంది. విందులు, వినోదాలకు దూరంగా ఉండాలి. తల్లిదండ్రులు తమ పిల్లలు సెల్‌ఫోన్‌లు, టీవీలు చూడకుండా జాగ్రత్తపడాలి. ఇంట్లో ప్రతీరోజు చదివేలా చూడాలి. రోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలి. మాస్ కాపీయింగ్‌కు ఎలాంటి ఆస్కారం లేకుండా పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తాం. పదో తరగతి పరీక్షలనేది విద్యార్థి భవిష్యత్‌కు తొలిమెట్టు. ఇక్కడ మంచి మార్కులు సాధిస్తేనే భవిష్యత్ బంగారు బాటగా ఉంటుంది. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. ఒకరోజు ముందు పరీక్ష కేంద్రాలను సందర్శించాలి. మార్చి 1 నుంచి ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహిస్తాం.

ఆలయాలకు ఇక కొత్త పాలకవర్గాలు



జైనథ్ లక్ష్మీనారాయణ స్వామి ఆలయం

- త్వరలోనే నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- జిల్లాలో ఐదు ఆలయాలకు ..

కైలాస్‌నగర్: ప్రధాన దేవాలయాలకు నూతన పాలకవర్గాలను నియమించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటికే పలు ఆలయాల పాలకవర్గాలు రద్దు కాగా, ఈ నెలతో ముగియనున్న పాలకవర్గాలకు కొత్త కమిటీలను నియమించాలని యోచిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 415 ఆలయాలకు నూతన పాలకవర్గాలను నియమించాలని భావించిన రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని ఐదు ప్రధాన ఆలయాలు దేవాదాయ ధర్మదాయ శాఖ పరిధిలో కొనసాగుతుండగా వీటి పాలకవర్గాల గడువు ఇప్పటికే ముగిసింది. వాటికి కొత్త పాలకవర్గాలు ఎన్నిక కానున్నాయి. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీతో పాటు ముఖ్య నాయకుల ద్వారా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను ప్రసన్నం చేసుకునే దిశగా ఆశావహులు తమవంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

ఆ ఆలయాలు ఇవే..

జిల్లాలో అనేక ఆలయాలు ఉన్నప్పటికీ దేవాదాయ ధర్మదాయ శాఖ పరిధిలో మాత్రం ఐదు ఆలయాలు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా ఆదివాసీల ఆరాధ్య దైవంగా భావిస్తున్న కేస్లాపూర్ నాగోబా ఆలయంతో పాటు సుప్రసిద్ధ జైనథ్ మండలంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి, పెండల్‌వాడ విజయ హనుమాన్ ఆలయం, ఆదిలాబాద్ పట్టణంలోని బ్రాహ్మణవాడలో గల శాస్త్రి మందిర్, చించర్‌వాడలోని విజయ హనుమాన్ ఆలయాలు ఆ శాఖ పరిధిలో ఉన్నాయి. ఇప్పటివరకు ఈ పాలకవర్గాలకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీకి చెందిన ముఖ్య నాయకులే పాలకవర్గాల పోస్టుల్లో ప్రాతినిధ్యం వహించారు. ఇటీవల కొన్ని పాలకవర్గాల గడువు ముగియగా, మిగితా పాలకవర్గాలను రద్దు చేస్తూ కొత్తగా ఎన్నుకునే దిశగా ప్రభుత్వం శనివారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆయా ఆలయాలకు కొత్త పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రధానంగా అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాటు ఆలయ ఆదాయాన్ని బట్టి కమిటీ సభ్యులు ఉండనున్నారు. ఒక్కో ఆలయ పాలకవర్గంలో 9 నుంచి 12 మంది సభ్యులు ఉండనున్నారు. అయితే ఇందులో నాగోబా ఆలయం మినహాయిస్తే మిగితా నాలుగు ఆలయాల్లో 9 మంది సభ్యులే ఉండనున్నారు. ఈ నేపథ్యంలో ఆయా పదవులను దక్కించుకునేందుకు అధికార పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు తమదైన శైలిలో ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డిని ప్రసన్నం చేసుకునే దిశగా తమవంతు ప్రయత్నాలు చేపట్టారు. ఆయన ఆశీస్సులు లభిస్తే పదవులు దక్కుతాయనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నారు.

'ఎంపీ స్థానాల గెలుపే లక్ష్యం'



మాట్లాడుతున్న రావుల రాంనాథ్

ఉట్నూర్‌రూరల్: ఎంపీ స్థానాల గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని బస్సుయాత్ర జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్, సహ ఇన్‌చార్జి రితేశ్ రాథోడ్ అన్నారు. ఈ నెల 20న బాసర నుంచి బస్సుయాత్ర ప్రారంభించనున్న సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదిలాబాద్, నిజామాబాద్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాల సాధనే లక్ష్యంగా ఈ యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. బస్సు యాత్ర ప్రారంభోత్సవానికి అస్సాం ముఖ్యమంత్రి హాజరు కానున్నట్లు వారు పేర్కొన్నారు. ఇందులో భాగంగా 22న ఉట్నూర్ ఐబీలో బీజేపీ బహిరంగసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజశేఖర్, నాయకులు భూపతి, తన్నీరు సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సీవోఈ ప్రవేశ పరీక్ష



హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌రూరల్: గిరిజన గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ) ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా కేంద్రంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 721 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 687 మంది హాజరుకాగా 34 మంది గైర్హాజరయ్యారు. గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 400 మందికి గానూ 383 మంది, గిరిజన డిగ్రీ గురుకుల కళాశాలలో 321 మందికి గానూ 304 మంది హాజరయ్యారు. కేంద్రాల్లో సరైన వసతుల్లేని కారణంగా విద్యార్థులు ఇబ్బందుల నడుమ పరీక్ష రాయాల్సి వచ్చింది. పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థులు రాష్ట్రంలోని గిరిజన సీవోఈ కళాశాలల్లో సీటు పొందనున్నారు. వారికి ఇంటర్‌తో పాటు జేఈఈ మెయిన్స్, ఐఐటీ, మెడిసిన్ రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కమిటీ ఎన్నిక



అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

మంచిర్యాలటౌన్: ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.మల్లారెడ్డి ఎన్నికల పరిశీలకునిగా, అడ్వకేట్ శ్రీనివాస్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. చీఫ్ ప్యాట్రన్‌గా డాక్టర్ ఎస్.వేణుగోపాలాచారి, చైర్మన్‌గా కె.పార్థసారథి, అధ్యక్షుడిగా బి.గోవర్ధన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆర్.నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.రఘునాథరెడ్డి, ట్రెజరర్‌గా కనపర్తి రమేశ్, ఉపాధ్యక్షులుగా రాంచందర్, ఎస్.శ్రీధర్ రెడ్డి, ఎం.సాంబమూర్తి, యు.చంద్రమోహన్‌గౌడ్, ఎం.శ్రీనివాస్, కే.చంద్రయ్య, జాయింట్ సెక్రెటరీలుగా పుల్లూరి సుధాకర్, సుకుమార్ ప్రాన్సిస్, బి.రమేశ్, కే.శేఖర్, కే.పాండునాయక్, కే. శ్రీనివాసరాజు, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, ఈ. మారయ్య, ఎల్. శరత్‌బాబు, బి. శ్రీనివాస్ గౌడ్, డి. దేవేందర్, ఎస్. హరిచరణ్, భూమన్న, ఈశ్వరాచారి, మహేందర్‌సింగ్, చీఫ్ అడ్వైజర్‌గా కే. సుదర్శన్‌గౌడ్, అడ్వైజర్లుగా బి. బాబురావు, పరిమళ, లీగల్ అడ్వైజర్లుగా చిట్ల రమేశ్, నిమ్మతి శ్రీనివాస్, టెక్నికల్ అడ్వైజర్‌గా ఎండీ నజీర్ ఎన్నికయ్యారు.

గోవర్ధన్‌రెడ్డికి సన్మానం..

ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన గోవర్ధన్‌రెడ్డిని డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, క్రీడా సంఘాల బాధ్యులు రాష్ట్ర పాల్, రాజేశ్, స్వామి, అజయ్, తదితరులు సన్మానించారు.

'నాగోబా' ఆదాయం రూ.17.71 లక్షలు



హుండీ లెక్కిస్తున్న మెస్రం వంశీయులు, అధికారులు

- హుండీ ద్వారా రూ.8.62 లక్షలు..
- తైబజార్ ద్వారా రూ.9.09 లక్షలు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఈ ఏడాది నాగోబా జాతర ఆదాయం రూ.17.71 లక్షలు సమకూరింది. ఈ నెల 9 నుంచి 17వరకు జాతర కొనసాగింది. ఇందులో భాగంగా ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీని మెస్రం వంశీయులు, దేవాదాయ, రెవెన్యూ అధికారుల సమక్షంలో ఆదివారం లెక్కించారు. హుండీ ద్వారా రూ.8లక్షల 62 వేల 15, తైబజార్ ద్వారా రూ.9 లక్షల 9 వేలు, కానుకల రూపంలో 425 గ్రాముల వెండి వచ్చినట్లు ఈవో రాజమౌళి తెలిపారు. కార్యక్రమంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, మెస్రం వంశ పెద్దలు కోసు, కోసేరావ్, బాదిరావ్‌పటేల్, వంశ ఉద్యోగులు శేఖర్‌బాబు, సోనేరావ్, కోసేరావ్, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యం..అందని దైన్యం

- శిథిలావస్థలో పశువైద్యశాల భవనాలు
- వెక్కిరిస్తున్న ఖాళీలు
- పశువులకు అందని వైద్యం

జిల్లాలో పశుసంపద వివరాలు

ఆవులు	3.50 లక్షలు
మేకలు	2.50 లక్షలు
గేదెలు	51 వేలు
గొర్రెలు	85 వేలు
పశువైద్యశాలలు	19
వైద్యులసంఖ్య	12
ఖాళీలు	07



తాంసి మండలం పొన్నారిలో శిథిలావస్థలో పశువైద్యశాల



సిరికొండ మండల కేంద్రంలో అద్దెగదిలో కొనసాగుతున్న పశువైద్యశాల

ఇచ్చోడ: పశుపోషణ రైతులకు కొండంత అండగా నిలుస్తుంది. సాగుకు అనుబంధంగా రైతులు పశువులను పోషిస్తారు. అతివృష్టిలో, అనావృష్టిలో వారికి ఆర్థికంగా తట్టుకునేందుకు పశుపోషణ ఆసరాగా నిలుస్తోంది. కానీ పశువులు అనారోగ్యం బారినపడితే వైద్యం అందని పరిస్థితి నెలకొంది. శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాలలు, వెక్కిరిస్తున్న వైద్యపోస్టుల ఖాళీలతో పశువులకు వైద్యం అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. జిల్లా వ్యాప్తంగా 7.31 లక్షల పశువులు ఉన్నాయి. వీటికి పూర్తిస్థాయిలో వైద్యం అందించేందుకు వైద్యాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వైద్యం అందించేందుకు సరైన భవనాలు లేవు. ఉన్న వాటిలో చాలా వరకు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఏటా వర్షాకాలంలో పశువులు వ్యాధుల బారినపడి మృత్యువాత పడుతున్నాయి. దీంతో పశుపోషకులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

శిథిల భవనాలు

గుడిహత్నూర్ మండలంలోని తోషం, శాంతపూర్, తలమడుగు మండలంలోని సుంకిడి, నేరడిగొండ మండలంలోని తర్నం, తాంసి మండలంలోని కరంజి, పొన్నారి, బోథ్ మండలంలోని సొనాల గ్రామాల్లో ఏళ్లక్రితం నిర్మించిన భవనాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. గాదిగూడ మండల కేంద్రంతో పాటు బేల మండలంలోని సాంగిడి గ్రామాల్లో పక్కా భవనాలు లేకపోవడంతో అరకొర వసతుల మధ్య అద్దెభవనాల్లో పశువైద్యశాలలు కొనసాగిస్తున్నారు. సిరికొండ మండల కేంద్రంలోని పశువైద్యశాల భవనాన్ని రెవెన్యూ కార్యాలయానికి కేటాయించడంతో ప్రస్తుతం అద్దెగదిలో పశువైద్యశాల కొనసాగుతోంది.

వెక్కిరిస్తున్న ఖాళీలు

నేరడిగొండ మండల కేంద్రంతో పాటుగా బోథ్ మండలంలోని సోనాల, నార్నూర్, బేల, సిరికొండ, ఇంద్రవెల్లి మండలాల్లో పశువైద్యాధికారులు లేకపోవడంతో అటెండర్లే పశువులకు వైద్యం అందిస్తున్నారు. ఇచ్చోడలో పశువైద్యాధికారితో పాటు అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. తాంసి, పొన్నారి రెండింటికీ కలిపి ఒక్కరే వైద్యసేవలు అందిస్తున్నారు. బేల పశువైద్యశాలకు గిమ్మలో విధులు నిర్వహిస్తున్న పశు వైద్యాధికారి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. తలమడుగు, సుంకిడి పశువైద్య కేంద్రాలకు ఒక్కరే వైద్యసేవలు అందిస్తున్నారు. నార్నూర్ మండల కేంద్రంతో పాటు తాడిహత్నూర్‌లో విధులు నిర్వర్తిస్తున్న వైద్యాధికారులు ఇతర జిల్లాలకు డెప్యూటేషన్‌పై వెళ్లడంతో అటెండర్లే వైద్యసేవలు అందిస్తున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా పశువులకు అత్యవసర సమయాల్లో వైద్యం అందడంలేదు.

ప్రభుత్వానికి నివేదించాం

జిల్లాలో పశువైద్యాధికారుల పోస్టుల ఖాళీలపై ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే ఖాళీ పోస్టులను భర్తీ చేస్తాం. పలు మండలాల్లో పశువైద్య భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి వివరాలను సైతం ప్రభుత్వానికి నివేదించాం.

– కిషన్, జిల్లా పశువైద్యాధికారి

క్లుప్తంగా

విజయ సంకల్పయాత్ర విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఇంద్రవెల్లి: ఈ నెల 20 నుంచి ప్రారంభమయ్యే బీజేపీ విజయ సంకల్ప యాత్రను విజయంవంతం చేయాలని బస్సు యాత్ర ఇన్‌చార్జి రావులరాంనాథ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో ఈ యాత్ర కొనసాగుతున్నట్లు తెలిపారు. బాసర నుంచి ప్రారంభమయ్యే యాత్ర ముధోల్, నిర్మల్, బోథ్, ఆదిలాబాద్, ఖానాపూర్ నియోజకవర్గాల మీదుగా బస్సు కొనసాగనుందని తెలిపారు. ఈ నెల 22న ఇంద్రవెల్లి మండల కేంద్రంలో యాత్ర ఉంటుందని వివరించారు. త్వరలో నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల్లో 12 పార్లమెంట్ స్థానలో గెలిపే లక్ష్యంగా ఈ యాత్ర కొనసాగుతుందని, యాత్రకు రాష్ట్ర స్థాయి ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ బస్సు యాత్రకు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, స్వచ్ఛ భారత్ జిల్లా కన్వీనర్ దిపక్‌సింగ్‌షెకవ్, జిల్లా నాయకులు ఆడావ్ చంపత్‌రావ్, మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, కార్యకర్తలు భీంరావ్, పెందోర్ భీంరావ్ ఉన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



మృతి చెందిన జింకను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

లక్ష్మణచాంద: కుక్కల దాడిలో జింక మృతి చెందిన సంఘటన మండలంలోని మునిపెల్లి గోధావరి సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... మండలంలోని మునిపెల్లి గ్రామ గోదావరి సమీపంలో ఆదివారం గోదావరి గట్టున గల పంటపొలాలో కుక్కలు జింకపై దాడి చేస్తుండగా రైతులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖ డిప్యూటీ ఎఫ్ఆర్‌వో నజీర్‌ఖాన్ సిబ్బందితో వెళ్లి చూడగా జింక అప్పటికే మరణించింది. దీంతో వెంటనే మండల పశు వైద్యాధికారి అజయ్ కుమార్‌కు ఫోన్‌లో సమాచారం అందజేయగా ఆయన అక్కడకు చేరుకుని పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం అక్కడే ఖననం చేశారు. ఇందులో ఎఫ్‌బీవో నూమన్ ఉన్నారు.

దాడిచేసిన వారికి రిమాండ్

కుభీర్: ఈ నెల 15న అవినాష్ అనే యువకుడిపై దాడిచేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి వారినిఅరెస్ట్ చేసి నిర్మల్ కోర్టు ముందు హాజరు పర్చగా మెజిస్ట్రేట్ వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై ఎండీ.షరీఫ్ తెలిపారు.

అటకెక్కిన 'చెత్త'శుద్ధి



కోటపల్లి మండలం బబ్బురుచెల్కలో నిరుపయోగంగా కంపోస్టు షెడ్డు

- ఉమ్మడి జిల్లాలో నిరుపయోగంగా షెడ్లు
- కొన్ని గ్రామాలకు దూరంగా..
- నెరవేరని ప్రభుత్వ ఆశయం

కోటపల్లి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పంచాయతీలకు తగిన ఆదాయం సమకూర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ప్రతీ పంచాయతీలో కంపోస్టు షెడ్లు నిర్మించింది. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.12 లక్షలు వెచ్చించింది. గ్రామాల పరిశుభ్రతకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిదే అయినా కిందిస్థాయి ఉద్యోగుల అలసత్వం కారణంగా నిర్మాణాలు నిరుపయోగంగా మారుతున్నాయి. కొన్ని పంచాయతీల్లో షెడ్లు గ్రామానికి దూరంగా ఉండటంతో వినియోగించడం లేదు. ప్రతీ జీపీకి ఒక ట్రాక్టర్ సమకూర్చడంతో చెత్త సేకరణ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేవు. కొన్ని చోట్ల నిత్యం జరగకపోవడంతో గ్రామీణ ప్రజలు ఖాళీ స్థలాల్లోనే పడేస్తున్నారు. వర్షాకాలంలో ఆ చెత్త తడిసి దుర్గంధం వెదజల్లుతోంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..		
జిల్లా	పంచాయతీలు	ప్రత్యేకాధికారులు
మంచిర్యాల	311	138
కుమురంభీం	335	125
నిర్మల్	396	176
ఆదిలాబాద్	468	123

తయారుకాని ఎరువు!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1509 గ్రామ పంచాయతీలకు గత ప్రభుత్వం ఒక ట్రాక్టర్‌తోపాటు నీళ్ల ట్యాంకర్ కేటాయించింది. గ్రామాల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించేందుకు గతంలో బుట్టలు పంపిణీ చేసింది. వీటిని కొంతవరకే పంపిణీ చేయగా..చాలామందికి చెత్త బుట్టలు రాకపోవడంతో వారు తడి,పొడి చెత్తను వేరు చేయకుండా ఇష్టానుసారంగా అందిస్తున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది వాటిని వేరుచేసి షెడ్లలో వేసి ఎరువు తయారు చేయాలి. ఇలా తయారైన ఎరువును గ్రామ పంచాయతీలు విక్రయించి అదనపు ఆదాయాన్ని పెంచుకోవాలనేది వీటి ఉద్దేశం. గ్రామాల్లో ఎరువు తయారు చేస్తున్న దాఖలాలే లేవు. కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

వృథాగా నిర్మాణాలు

సేంద్రియ ఎరువు తయారు చేసేలా కంపోస్టు షెడ్లు నిర్మించారు. బ్లాకుల వారీగా నిర్మాణాలు చేపట్టారు. వీటిలో చాలారోజుల వరకు చెత్తను నిలవ్వచేసి సేంద్రియ ఎరువుగా మారుస్తారు. ఈ షెడ్లు గ్రామాలకు దూరంగా ఉండటంతో నిరుపయోగంగా మారాయి. జాగా లేదని కొద్దిస్థలంలో నిర్మాణం చేపట్టి వదిలేశారు. ఒకే స్థలంలో శ్మశానవాటిక, కంపోస్టు షెడ్లు నిర్మించారు. అధికారులు స్పందించి వెంటనే వీటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకువస్తాం

గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంపోస్టు షెడ్లను వెంటనే వినియోగంలోకి తీసుకువస్తాం. గ్రామాల్లో నిత్యం చెత్త సేకరణ జరిగేలా పంచాయతీ కార్యదర్శులను ఆదేశిస్తాం. షెడ్లలో సేంద్రియ ఎరువు తయారీ చర్యలు తీసుకుంటాం. – అక్తర్, ఎంపీవో కోటపల్లి

అమ్మవారి సేవలో.. హైకోర్టు జడ్జి



ఆలయంలో పూజలు చేస్తున్న న్యాయమూర్తి

భైంసా: బాసర సరస్వతీ మాతను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రావణ్‌కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. కుటుంబసమేతంగా బాసర చేరుకుని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు శాలువాతో సత్కరించి అమ్మవారి ఆశీస్సులు, తీర్థ ప్రసాదాలు అందించారు. ఇందులో నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, ఆలయ చైర్మన్ శరత్ పాఠక్, ఈవో విజయరామారావు, ఏఈవో సుదర్శన్‌గౌడ్, ప్రధానార్చకులు, వేదపండితులు ఉన్నారు.

కాలిబూడిదైన శనగ కుప్ప

- 25క్వింటాళ్ల శనగపంట బుగ్గి పాలు
- రూ. 1.20లక్షల ఆస్తి నష్టం
- ఆదుకోవాలని అన్నదాత వేడుకోలు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

జైనథ్: మండల కేంద్రానికి చెందిన సయ్యద్ సాధిక్ అనే రైతు చేన్లో నిల్వ ఉంచిన శనగ పంట కుప్ప కాలిబూడిదయ్యింది. బాధిత రైతు, స్థానికుల కథనం ప్రకారం... సాధిక్ తన మూడెకరాల చేన్లో ఈ ఏడాది శనగ పంట సాగుచేశాడు. పంట ఏపుగా పెరిగి కోతకు వచ్చింది. దీంతో ఇటీవల శనగ పంట కోత కోసి చేనులో కుప్పగా పోసుకున్నాడు. ఎప్పటిలాగే ఆదివారం ఉదయం చేనుకువెళ్లి చూడగా కాలి బూడిదైంది. దీంతో రైతు లబోదిబోమంటూ పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సై పురుషోత్తం, స్థానిక నాయకులు, రైతులతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోలీసులకు సంఘటన స్థలంలో అగ్గిపెట్టె దొరికనట్లు తెలిసింది. అసలు పంటకు ఎవరు నిప్పు పెట్టారు? అసలేం జరిగింది? అనే విషయాలు ఇంకా తెలియాల్సి ఉంది. దాదాపు రూ. 1.20 లక్షల విలువ చేసే 25క్వింటాళ్ల శనగ పంట కాలిబూడిదయ్యిందని, ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు.

హీరాసుక జయంతిని విజయవంతం చేయాలి



స్థలం పరిశీలిస్తున్న ప్రధాన్‌సమాజ్ పెద్దలు

ఇంద్రవెల్లి: ఈ నెల 26న ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించే గోండి ధర్మగురు హీరాసుక జయంతికి సమాజ్ ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ప్రధాన్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు దుర్వ నగేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించి సభ స్థలాన్ని పరిశీలించారు. ఈ నెల 26న ఉదయం 11 గంటలకు వ్యవసాయ మార్కెట్ యార్డులో జిల్లా స్థాయిలో హీరాసుక జయంతిని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో పాటు ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. జయంతి కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా ప్రధాన్ సమాజ్ పెద్దలు, యువకులు, ఉద్యోగస్తులు, మేధవులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన్ సమాజ్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుసం ఆనంద్‌రావ్, ప్రధాన్‌గూడ పటేల్ గెడం జ్ఞానేశ్వర్, ప్రధాన్ సమాజ్ పెద్దలు మడావి విశ్వనాథ్, యాదోరావ్, శంకర్, సోయం రాందాస్, గేడం భారత్ ఉన్నారు.

బాల్య వివాహం అడ్డగింత

చింతలమానెపల్లి: మండలంలోని హేటిగూడ గ్రామంలో బాల్యవివాహాన్ని బాలల సంరక్షణ అధికారులు ఆదివారం అడ్డుకున్నారు. సోమవారం బాలికకు వివాహం నిశ్చయించారని సమాచారం అందడంతో వారు గ్రామానికి చేరుకున్నారు. బాలిక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు అధికారులు అవగాహన కల్పించారు. లీగల్ సెల్ అధికారి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ బాల్యవివాహాలు జరిపిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్యవివాహాలతో బాలికకు ఆరోగ్య, మానసిక పరమైన సమస్యలు వస్తాయన్నారు. బాలికను జిల్లా కేంద్రంలోని సఖీ కేంద్రానికి తరలించారు. 1098 కోఆర్డినేటర్ ప్రవీణ్, కౌన్సిలర్ రవళి, స్థానిక సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట సమీపంలోని అర్బన్ పార్కు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణ సీఐ రవీందర్ కథనం ప్రకారం.. వేమనపల్లి మండలం రాజారం గ్రామానికి చెందిన యువకులు నాయిని గోవర్దన్, సుమన్‌లు బైక్‌పై పని నిమిత్తం మంచిర్యాలకు వెళ్లి తిరిగివస్తున్నారు. ఈక్రమంలో చెన్నూర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న లారీ అతివేగంతో బైక్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని 108 వాహనంలో చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు పంపించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

కారు, బైక్ ఢీకొని ఒకరు..

భీమారం: కారు బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. నెన్నెల మండలం వెంకటాపూర్‌కు చెందిన జక్కుల కిష్టస్వామి తన స్నేహితుడితో కలిసి బైక్‌పై చెన్నూర్‌లోని గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా ఆదివారం భీమారం బస్టాండ్ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కిష్టస్వామికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

- అనుమానాలున్నాయని కుటుంబీకుల ఆరోపణ



కవితాబాయి మృతదేహం

సారంగపూర్: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి వివరాల ప్రకారం ... మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ కవితాబాయి (40), భర్త రమేష్‌లకు మధ్య కొద్దిరోజులుగా మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఇంటి నుంచి బయటకు వచ్చిన కవితాబాయి గోపాల్‌పేట్ చెరువు వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కవితాబాయి మృతిపై ఆమె సోదరుడు జాదవ్ రవి అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు. మృతురాలికి ముగ్గురు సంతానం ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

ఉరేసుకుని మరొకరు..



సుక్కన్న మృతదేహం

లోకేశ్వరం: మద్యానికి బానిసై ఒకరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని కన్కపూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఏఎస్సై దిగంబర్ వివరాల ప్రకారం... సుక్కనూరు సుక్కన్న(55) మూడు నెలల నుంచి ఎలాంటి పనిచేయకుండా మద్యానికి బానిసై తిరుగుతుండేవాడు. తాగుడికి బానిసై శనివారం రాత్రి అందరు నిద్రిస్తున్న సమయంలో తన ఇంటి ఎదుట ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య గంగవ్వ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి..

కౌటాల: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎస్.మధుకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని బోదంపల్లి గ్రామానికి చెందిన సూరం విజయ్ (24), పల్లవి భార్యభర్తలు. వీరికి కుమార్తె ఉంది. విజయ్..వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కుటుంబ పోషణ భారంగా మారడంతో ఈనెల 14న రాత్రి భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. ఆగ్రహానికి లోనై విజయ్ భార్యపై చేయి చేసుకోవడంతో అదే రాత్రి పల్లవి తన పుట్టింటికి వెళ్లింది. మేడారం జాతర వెళ్లేందుకు భార్యను పంపించాలని విజయ్ శనివారం సాయంత్రం అత్తకు ఫోన్ చేశాడు. పంపించనని చెప్పడంతో మనస్తాపం చెంది రాత్రి తన పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు ఆదివారం పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడి అన్నయ్య బానేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గోదావరిలో దూకి గర్భిణి.. ఆత్మహత్యాయత్నం

భైంసా: బాసర గోదావరి వద్ద గర్భిణి కుటుంబ కలహాల నేపథ్యంలో గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాసర ఎస్సై గణేశ్ వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం బెల్లాల్‌కు చెందిన మూడు నెలల గర్భిణి ఆదివారం బాసరకు చేరుకుంది. స్థానిక గోదావరి నదిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా సమీపంలో ఉన్న గంగపుత్రులు ఆమెను కాపాడారు. అనంతరం బాసర పోలీస్‌స్టేషన్‌కు తీసుకురాగా కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పజెప్పినట్లు ఎస్సై తెలిపారు.



తిర్పెల్లి శ్మశానవాటిక సమీపంలో..

జోరుగా... జీరో దందా!

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు పట్టణశివారు ప్రాంతాల్లో పత్తి, కంది, సోయాబిన్ జీ రో దందా జోరుగా సాగుతోంది. పలువురు వ్యాపారులు అక్రమంగా దుకాణాలు ఏ ర్పాటు చేసుకుని ఈ దందా కొనసాగిస్తున్నా రు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ నిలువు దోపిడీకి గురి చేస్తున్నారు. నియంత్రించాల్సిన మార్కెటింగ్ శాఖ అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



ఆదిలాబాద్ పట్టణం చాంద-టి సమీపంలో..



జందాపూర్ ఎక్స్‌రోడ్ సమీపంలో..

'సర్దార్' ఆటోగ్రాఫ్..!



చిన్నారి బుగ్గపై ఆటోగ్రాఫ్ చేస్తున్న సినీ నటుడు, బీజేపీ నాయకుడు సర్దార్ అభినవ్

భైంసాటౌన్: సినీ నటుడు, బీజేపీ నాయకుడు సర్దార్ అభినవ్ ఆటోగ్రాఫ్ కోసం చిన్నారులు, విద్యార్థినులు ఎగబడ్డారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఆదివారం భైంసాకు వచ్చిన ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. పేద కుటుంబం నుంచి సినీ అవకాశాల వరకు తన ప్రస్థానాన్ని వివరించారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలని తెలిపారు. కార్యక్రమం అనంతరం ఆయన తిరిగి వెళ్తున్న సమయంలో విద్యార్థినులు, చిన్నారులు ఆయనతో సెల్ఫీ, ఆటోగ్రాఫ్ కోసం పోటీపడ్డారు. దీంతో ఇలా ఓ చిన్నారికి బుగ్గపై ఆటోగ్రాఫ్ చేశాడు.

ఖానాపూర్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సురేందర్ రెడ్డి

నిర్మల్‌రూరల్: ఖానాపూర్ పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర గజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కడారు సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశాడు. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ అధ్యాపకుల సంఘం ఆత్మీయ సమావేశం ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ... ఖానాపూర్‌లో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల సంఘం కృషితో ముధోల్, ఇచ్చోడలలో డిగ్రీ కళాశాలలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. డిగ్రీ కళాశాల అధ్యాపకులకు కూడా ప్రొఫెసర్ హోదా రావడానికి, అధ్యాపకుల సమస్యలను పరిష్కరించడానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఇందులో జిల్లా అధ్యక్షుడు కటకం మురళి, సలహాదారులు బెల్లీ యాదయ్య, రమేష్‌గౌడ్, శ్రీరామ్, శంకరయ్య అసిస్టెంట్ ప్రొఫెసర్లు రవికుమార్, గంగాధర్, శంకర్, సంతోష్, అర్చన, సరిత, సంగీత, సూర్య సాగర్, సుభాష్, శ్రీహరి పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే ఆయుధం



పోటీలను ప్రారంభిస్తున్న శంకర్



గెలుపొందిన విద్యార్థులు

బెల్లంపల్లి: కరాటే విద్య ఆత్మరక్షణకు ఆయుధంగా నిలుస్తుందని టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్ అన్నారు. పట్టణంలోని టీసీఓఏ క్లబ్‌లో కట్కూరి మల్లేశ్వరి, నీలి పార్వతి స్మారక రెండో జాతీయ స్థాయి కరాటే పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వల్ల మానసిక, శారీరక దృఢత్వం ఏర్పడుతుందన్నారు. బాల,బాలికలకు చిన్నతనంలో కరాటే శిక్షణ ఇప్పించేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ విజ్జగిరి రవి, దిలీప్‌కుమార్, నిజామ్, కరాటే మాస్టర్లు కట్కూరి వెంకటేశ్, ఎం.శంకర్, శ్రీనివాస్, ఎనగందుల వెంకటేశ్, ఈశ్వర్‌కుమార్, దేవయ్య, శ్రీనివాస్, రవి, రాజేష్, రాజా, భూషణ్, శివ మహేశ్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

చెన్నూర్: బెల్లంపల్లిలో ఆదివారం నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో స్థానిక శర్వాణి పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు కరాటే ఇన్‌స్ట్రక్టర్ రామగిరి స్వామి తెలిపారు. ఆరేళ్లలోపు కటా విభాగంలో స్నేహిత్ కుమార్ (బంగారు), ఎనిమిదేళ్లలోపు కటా విభాగంలో ఆర్.సృజన్ (బంగారు) పతకాలు సాధించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలను పాఠశాల కరస్పాండెంట్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి, మాస్టర్లు అభినందించారు.



జీవాలతో వలసబాట...

నిజామాబాద్ జిల్లా నుంచి గొర్రెల కాపర్లు నిర్మల్ జిల్లాకు వలసబాట పట్టారు.. మేకలు, గొర్రెలు తీసుకుని పక్షం రోజుల క్రితం జిల్లాకు చేరుకున్నారు. తానూరు, ముధోల్, కుభీర్ మండలాల్లోని ఆయా గ్రామాల శివారులోని పంట పొలాల్లో జీవాలను మేపుతున్నారు. రాత్రి వేళా పొలాల్లో జీవాల మంద పెడుతున్నారు. ఇందుకు రైతులు ఒక రోజుకు రెండు అద్దల బియ్యం, రూ.రెండు వందలు ఇస్తారని కాపరులు చెబుతున్నారు. ఈ నెలలో అక్కడ వరి పంట ఉండడంతో జీవాలకు మేత లేకపోవడంతో ఇక్కడికి వస్తున్నట్లు తెలిపారు. మంద పెట్టడంతో ఇటు కాపరులు.. అటు భూ యాజమానికి ప్రయోజనం చేకూరనుంది. - తానూరు